నిధుల స్వాహా కథకు ముగింపు ఎలా?

- రూ.29.50 లక్షల గుత్తల సొమ్ము స్వాహా
- బాధ్యులపై చర్యలు తీసుకోరా?
- రశీదులు ఎందుకు రాసిచ్చారో వివరణ లేదు
- త్వరలోనే తేల్చుతామంటున్న కమిషనర్


మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

మదనపల్లె: సెలక్షన్ గ్రేడ్ మదనపల్లె మున్సిపాలిటీలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో గుత్తల లీజు సొమ్ము స్వాహా కథకు అధికారులు ఎలాంటి ముగింపు ఇస్తారన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. పై ఏడాదికి సంబంధించి వారపుసంత, దినసరి మార్కెట్, జంతువధశాలలను రూ.94.55 లక్షలకు గుత్తకు అప్పగించారు. ఇందులో రూ.29.50 లక్షల సొమ్ముకు సంబంధించిన వ్యవహారం నానుతోంది. ఈ నిధుల స్వాహాపై మే 14న సాక్షిలో కథనం ద్వారా వెలుగులోకి తేవడంతో కదలిక వచ్చింది. ప్రస్తుతం ఈ స్వాహా కథకు అధికారులు ఎలా ముగింపు పలుకుతారు, నిధులను రాబట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది తేలాల్సి ఉంది. ఏ నిర్ణయం తీసుకోకపోతే అధికారులు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది. త్వరలోనే దీనిపై చర్యలు తీసుకుని స్వాహా కథకు ముగింపు పలకాలని అధికారులు నిర్ణయించారు. ఆ ముగింపు ఎలా ఉంటుంది అన్నదానిపై చర్చనీయాంశమైంది.

రశీదులు ఎందుకిచ్చారు?

గుత్తలకు సంబంధించి రూ.29.50 లక్షలు స్వీకరించినట్టుగా మున్సిపల్ ఉద్యోగి చేతిరాతతో రశీదులు ఇచ్చారు. వాస్తవంగా పైసా సొమ్మయినా ఆన్‌లైన్‌లో చెల్లించి రశీదు ఇవ్వాలి. అలా ఎందుకు ఇవ్వలేదు, లేదా ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది తేలాలి. డబ్బు చెల్లించిన లీజుదారుడు చేతిరాతతో రశీదులు ఇస్తే తిరస్కరించి ఆన్‌లైన్ రశీదు ఇవ్వాలని ఎందుకు ప్రశ్నించలేదో తేల్చాలి.

ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించాల్సిన అధికారులు ఎందుకు ఉదాసీనంగా ఉన్నారో తెలియదు. ఈ వ్యవహారంలో మున్సిపల్ ఉద్యోగి చేతిరాత రశీదు స్వయంగా తీసుకున్న నిర్ణయమా లేక ఎవరైనా ఒత్తిడి చేశారా అన్న వివరాలు రాబట్టాల్సి ఉంది. మున్సిపల్ ఉద్యోగి, డబ్బు చెల్లించిన లీజుదారుడ్ని విచారించి వాస్తవాలను తేల్చాల్సి ఉంది. అధికారులు సీరియస్‌గా స్పందించి ఉంటే ఈపాటికి ఈ వ్యవహారం తేలిపోయేది.

ఆడియోలో చర్చ

చేతిరాత రశీదులు ఇచ్చిన ఉద్యోగిగా భావిస్తున్న వ్యక్తి, డబ్బు చెల్లించిన లీజుదారు మధ్య జరిగిన సంభాషణ ఆడియోలో ఈ అంశంపై స్పష్టంగా చర్చించుకున్నారు. మీ ఉద్యోగానికే నష్టం వస్తుంది డబ్బు కట్టేయండి, డబ్బు కట్టలేనోళ్లు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నిస్తుండగా, డబ్బు సమకూర్చడం కష్టంగా ఉంది చెల్లిస్తానంటూ ఉద్యోగిగా భావిస్తున్న వ్యక్తి చెబుతున్న ఆడియోలను అధికారులు పరిశీలించి విచారిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

త్వరలో తేల్చేస్తాం

లీజు సొమ్ము వ్యవహారంపై త్వరలోనే నిర్ణయం తీసుకుని పరిష్కారిస్తాం. ఇప్పటికే లీజుదారు సొమ్ము చెల్లించలేదని న్యాయస్థానం ఆశ్రయించాం. లీజు సొమ్ము తీసుకున్నట్టు రశీదులపై విచారణ జరుపుతాం. సంబంధిత ఉద్యోగి, లీజుదారును విచారించి, స్పష్టత వచ్చాక నిర్ణయం తీసుకుని దీనికి ముగింపు పలుకుతాం.

-కే.ప్రమీల, కమిషనర్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం సొసైటీ కాలనీ ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఈఈ గంగాధర్ తెలిపారు. సొసైటీకాలనీలోని రామాలయం వద్ద నుంచి ఎన్టీఆర్ సర్కిల్, శాంతారాం హాస్పిటల్, సురక్ష హాస్పిటల్, వాటర్‌ట్యాంక్, గ్లోబల్ స్కూల్ ప్రాంతాల్లో లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలు తీసివేయుటతో సరఫరా అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.

యల్లమ్మ జాతరతో ఆర్టీసీకి రూ. 6.47 లక్షల ఆదాయం

పీలేరు రూరల్ : కలికిరి యల్లమ్మ జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపం ద్వారా పీలేరు డిపోకు రూ. 6,47,660 ఆదాయం వచ్చినట్లు డీఎం బి. నిర్మల తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆది, సోమవారం రెండు రోజుల పాటు వివిధ ప్రాంతాల నుంచి కలికిరికి 33 బస్సు సర్వీసులు 15,532 కిలోమీటర్లు నడిపి, ఈపీకే 41.70, ఓఆర్ 79 సాధించినట్లు వివరించారు. గత ఏడాదికంటే రూ. 2 లక్షలు అదనంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆదాయం పెరగడానికి కృషి చేసిన ఆర్టీసీ సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ ధనుంజయలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మదనపల్లె: విజయవాడలో మున్సిపల్ కార్మికుల అరెస్టుకు నిరసనగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ ఏఐటీయూసీ యూనియన్ ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు మస్తాన్, కార్యదర్శి తిరుమల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిగా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వేతనాల పెంపు, పారిశుద్ధ్య కార్మికులకు ఆరు డీఏల మంజూరు, దినసరి కార్మికుల సమస్యలను పట్టించుకోపోగా నిరసన తెలుపుతున్న కార్మికులను అరెస్ట్ చేయడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, నరసింహులు, భాగ్యమ్మ, శంకరనాయక్, కదిరప్ప, శ్రీనివాసులు, రాధమ్మ పాల్గొన్నారు.

ఆసుపత్రి మౌలిక వసతులపై సమీక్ష


మౌలిక వసతులపై చర్చిస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులపై మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీకి సంబంధించి ఎలాంటి నిధులు లేకపోయినా ఆసుపత్రిలో కనీస మౌలిక వసతులు, అవసరమైన వస్తు సామగ్రిపై చర్చించారు. ఆసుపత్రిలో మూడు యూపీఎస్ బ్యాటరీలు, మరుగుదొడ్లలో మరమ్మతులు, జిల్లా కేంద్రం నుంచి ఇక్కడకు వచ్చే మందుల రవాణా ఖర్చు, స్టేషనరీ, ప్రింటర్,బీపీ మిషన్ల కొనుగోలుపై చర్చించారు. పీహెచ్‌సీకి మంజూరయ్యే నిధులతో సమస్యలను పరిష్కరించుకునేలా తీర్మానించారు. ఎంపీపీ మహమూద్, తహసీల్దార్ శ్రీరాములు నాయక్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఎండీ యస్దానీ, డాక్టర్ బీఎస్. సాదియా, సీనియర్ అసిస్టెంట్ బాలచంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలి

సుండుపల్లె : పంటలు సాగు చేసిన రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి మహబూబ్‌బాషా తెలిపారు. మంగళవారం సుండుపల్లె-3 రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, వేరుశనగ, టమాటా సాగు చేసిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ప్రీమియం చెల్లించాలన్నారు. అలా చెల్లించడం వలన ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగే నష్టాలకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందుతుందన్నారు. అలాగే కౌలు రైతులను గుర్తించి వీఆర్‌ఓ లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో ఏఏ పంటలు సాగు చేస్తున్నారనే విషయాలను నమోదు చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ధరలకు డ్రిప్పులు, స్ప్రింక్లర్లు అందజేయడం జరుగుతుందని మైక్రో ఇరిగేషన్ పీడీ సాయిప్రసన్న తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ తోడ్పాటుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోళ్లబైలులో నీటిసమస్యను పరిష్కరించండి

- ట్యాంకర్లు కొనుక్కునే స్తోమత లేదని ఆవేదన
- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామస్తుల నిరసన


నీటి సమస్యపై ఏఓ మస్తాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోళ్లబైలు గ్రామస్తులు

మదనపల్లె రూరల్ : మండంలోని కోళ్లబైలు పంచాయతీ శివాలయం కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, మూడునెలలుగా తాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ మస్తాన్‌ను కలిసి, తమ సమస్య పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...శివాలయం కాలనీలో సుమారు 200 కుటుంబాలకు పైగా జీవనం సాగిస్తున్నామన్నారు. మూడునెలల నుంచి నీటిసరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కాలనీలో నివసించే వారంతా కూలీలు, పేదవారు కావడంతో ట్యాంకర్లతో నీటిని తోలుకునే స్తోమత లేదన్నారు. నీటి సమస్య పరిష్కారం కోసం సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరిగినా అధికారులు ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇంటిపన్ను, నీటిపన్ను సక్రమంగా చెల్లిస్తున్న తమకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపడమేంటని వాపోయారు. కాలనీలో నీటిపైపుల డ్యామేజీ ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదన్నారు. తక్షణమే కాలనీవాసుల నీటిసమస్యను పరిష్కరించకపోతే, రోడ్డుమీదకు వచ్చి ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అధికారులు తక్షణమే స్పందించి, కాలనీవాసుల కోసం ప్రత్యేకంగా నూతన బోరు వేసి, నీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన


మాట్లాడుతున్న దంతవైద్యులు షరీఫ్

మదనపల్లె సిటీ: తరగతి గదుల్లో విద్యార్థులకు విద్యాబోధనతో పాటు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించాలని ప్రముఖ మోటివేటర్ రామమూర్తి సూచించారు. మంగళవారం స్థానిక ఆర్‌ఆర్ లేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యం, డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. యువత డ్రగ్స్‌కు బానిసలై మత్తులో తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ మహమ్మరిని తరిమికొట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పాఠశాల పునఃప్రారంభం నుంచి విద్యార్థులకు ఈ అంశంపై అవగాహన కల్పించాలన్నారు. స్మైల్స్ డెంటల్ కేర్ డాక్టర్ షరీఫ్ దంతాలు,వాటి పరిశుభ్రత విషయాలు వివరించారు. కార్యక్రమంలో వివేక ఆశయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుంపు భానుప్రకాష్, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎల్లమ్మ తిరునాల


కళ్ళిపాటు ఉత్సవానికి బయల్దేరుతున్న ఎల్లమ్మ

కలికిరి: మండల కేంద్రంలో మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన గ్రామదేవత ఎల్లమ్మ తిరునాల నాల్గవ రోజు కళ్లిపాటు ఉత్సవంతో ముగిసింది. మంగళవారం ఉదయం అమ్మవారి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఉత్సవ మూర్తి పారువేట వెళ్లి దుష్టశక్తులు గ్రామంలోకి ప్రవేశించకుండా అష్టదిగ్బంధనం అనంతరం ఆలయంలోకి ప్రవేశించారు. తరువాత అమ్మవారి కళ్లిపాటు కార్యక్రమం నిర్వహించారు. దీంతో జాతర ఉత్సవం ముగిసింది. జాతరలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బంది, అమ్మవారి వలంటీర్లు, సహకరించిన భక్తాదులకు ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, సురేంద్ర రెడ్డి, యోగేష్ రెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ సంస్థకు మంచి పేరు తీసుకురావాలి


ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎం వెంకటరమణరెడ్డి

మదనపల్లె సిటీ: ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగులు సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం డిపో కార్యాలయ ఆవరణంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. వారిలో మర్యాద మాట్లాడటం, స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలను వివరించాలన్నారు. ప్రైవేటు వాహనాల కంటే ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమన్నారు. డిపో పరిధిలో కెఎంపిఎల్ 5.51తో రీజియన్‌లో మొదటి స్థానం ఉందన్నారు. ఈపీకె, ఓఆర్ పెంచాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో వివాదాలు పరిష్కారం


అవగాహన కల్పిస్తున్న జడ్జి ఎస్. శ్రీనివాసులు

పీలేరురూరల్ : మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కారం అవుతాయని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో రాజీకి అర్హత కలిగిన వివిదాల పరిష్కారం మధ్యవర్తిత్వం ఎంతో మేలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వంపై 90 రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు సమయం, డబ్బు వృథా కాకుండా కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యేశ్వరుడికి అభిషేకాలు

నందలూరు : నందలూరు రైల్వేకేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని శ్రీ సుబ్రమణ్య స్వామికి మంగళవారం ఆలయ అర్చకులు సరసా రవికుమార్ స్వామి ఆధ్వర్యంలో మంగళవారం అభిషేకం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ నేపథ్యంలో భక్తులు స్వామికి పాలతో అభిషేకం చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి : 2026– 27 విద్యా సంవత్సరానికి సంబంధించిన నవోదయలో ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ చక్రేనాయక్ తెలియజేశారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఐదోతరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జూలై 29వ తేదీలోపు దరఖాస్తులను చేసుకోవచ్చన్నారు.

పుస్తకాలు పంపిణీ

వీరబల్లి : మానవ సేవే.. మాధవసేవ అని రాయచోటి లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్యామ్ తెలిపారు. మంగళవారం వీరబల్లి మండల కేంద్రంలో ఉన్న మోడల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు వంటి విద్యా మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ విద్యా మెటీరియల్స్‌ను వీరబల్లికి చెందిన దాత నాగరాజు పిల్లలకు మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ షేక్ మహమ్మద్, లయన్స్ క్లబ్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అటల్ పెన్షన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

రాయచోటి టౌన్ : అటల్ పెన్షన్ పథకాన్ని అర్హత కలిగిన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని శిబ్యాల కెనరా బ్యాంక్ మేనేజర్ రామనాథరెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామంలో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, సురక్ష బీమా యోజన అటల్ పెన్షన్ యోజన ప్రధాన మంత్రి జనధన్ యోజన అకౌంట్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాలలోపు వారికి రూ.436లు చెల్లిస్తే వారికి కలిగే ప్రయోజనాలపై వివరించి చెప్పారు. అలాగే రూ.2లక్షల ప్రమాద బీమా, రూ.2లక్షల సాధారణ బీమా, అంగవైకల్యానికి రూ.లక్షల సాధారణ బీమా లభిస్తుందని చెప్పారు. అలాగే 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల ఉన్న వారు నెలకు రూ.20లు చెల్లిస్తే రూ.2లక్షల బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డీఆర్‌డీఏఏపీఎంఎం శ్రీనివాసులు రెడ్డి, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ శివ నాగయ్య, వీఓఏ నారాయణ రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పాఠశాలల వద్ద దుకాణాలు తనిఖీ

సిద్దవటం : పాఠశాలలకు వంద మీటర్ల దూరంలోని దుకాణాల్లో ధూమపానం వంటివి అమ్మకూడదని దుకాణాదారులకు మంగళవారం తనిఖీలు చేసి అవగాహన కల్పించామని ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు దగ్గరలో అంటే వంద మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలలో ఇక మీదట బీడీ, సిగరెట్, పొగాకు, రాజా, కైనీ, గుట్కా, మిరాజ్ వంటి వాటిని దుకాణాలలో విక్రయించకూడదని ఆయన హెచ్చరించారు. మరో సారి దుకాణాలను తనిఖీ చేసినప్పుడు ధూమపానం వంటివి ఉన్నట్లయితే అట్టివారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని ఎస్‌ఐ అన్నారు.

కాలువలు ఇలా.. మురుగు కదిలేదెలా?

- అధికారుల నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేసిన నిసార్‌అహ్మద్
- చిరు వ్యాపారులు జీవనోపాధి కోల్పోయారని ఆవేదన
- తక్షణమే పనులు పూర్తి చేయాలని డిమాండ్


బెంగళూరు బస్టాండులో అసంపూర్తిగా వదిలివేసిన మురుగుకాలువను పరిశీలిస్తున్న నిసార్ అహ్మద్, వైఎస్సార్ సీపీ నాయకులు

మదనపల్లె రూరల్ : పట్టణంలో నిత్యం రద్దీగా ఉంటూ, ప్రధాన కేంద్రమైన బెంగళూరు బస్టాండ్‌లో రహదారి మధ్యలో మురుగుకాలువను రోజుల తరబడి పనులు చేయకుండా వదిలేస్తే...ప్రజల ఇబ్బందులు పట్టించుకునేదెవరంటూ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి బెంగళూరు బస్టాండులో అసంపూర్తిగా వదిలివేసిన మురుగుకాలువను పరిశీలించారు. రెండునెలలుగా రోడ్డుపైనే మురుగు పారుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. పట్టణం మధ్యలో దుర్వాసన వెదజల్లుతూ ప్రధాన రహదారిపై మురుగు ప్రవహిస్తుంటే, రోడ్డు మీద ప్రయాణీకులకు ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో ఆలోచించుకోవాలన్నారు. కాలువ నిర్మాణం పేరుతో మురుగును రోడ్డుపైకి మళ్లించడం ద్వారా బెంగళూరు బస్టాండులో పూల వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు చితికిపోయారన్నారు. మురుగుకాలువలో నుంచి వెలువడే దుర్గంధంతో, దుకాణాల కింద పారుతున్న మురుగును భరించలేక అతి కష్టం మీద బతుకుతున్నారన్నారు. కాలువ పనులు పూర్తిచేయకుండానే సీసీ రోడ్డు వేయడంతో పరిస్థితి మరింత జఠిలంగా మారిందన్నారు. బెంగళూరు బస్టాండులో సగానికి పైగా రోడ్డును కాలువను ఆక్రమించేయడం, మిగిలిన కొద్దిపాటి స్థలంలో బస్సులు, వాహనాల రాకపోకలు రెండువైపులా జరుగుతుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. సాయంత్రం పూట పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. బెంగళూరు బస్టాండు ఇందిరా సర్కిల్ నుంచి అప్పారావుతోట, అప్పారావువీధి, బడేమకాన్ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు రహదారిని బ్లాక్ చేయడంతో చుట్టూ తిరిగి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షం పడితే చెరువును తలపించే బెంగళూరు బస్టాండులో...మురుగునీరు తోడైతే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో చెప్పలేమన్నారు. ప్రజల ఇబ్బందులు కళ్లారా చూస్తున్నప్పటికీ, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. తక్షణమే ఈ అంశాన్ని అత్యవసరంగా భావించి, సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్‌ఆజం, కోఆప్షన్ మెంబర్ శారదారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మహేష్, నూర్ మొహియుద్దీన్‌ఖాన్, అపర్ణ, నాగమణి, అమ్మాజాన్, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై దాడి కూటమి ప్రభుత్వ అనాగరిక చర్య


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కలికిరి(వాల్మీకిపురం): కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దంపతులపై గుడివాడలో కూటమి నేతలు దాడి చేయడం అనాగరిక చర్య అని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ళ భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వాల్మీకిపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్థానిక బీసీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఒక బీసీ మహిళా నేతపై దాడి కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ రాజ్యాంగానికి పరాకాష్టగా నిలిచిందని, ఇందుకు బీసీలు తగిన రీతిలో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి రాష్ట్రంలో బీసీలపై కక్షపూరిత ధోరణి సాగుతోందన్నారు. దాడులు, అక్రమ కేసులతో బీసీలు ఎన్నటికి వెరవరన్నారు. బీసీలపై జరుగుతున్న దాడులను సర్వత్రా ప్రజలు గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వంపై ప్రజలలో వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను తట్టుకోలేకనే ఆ పార్టీ నేతలు దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కూటమి నేతలు దాడుల సంస్కృతి మానుకోవాలని హితవుపలికారు. బీసీ నేతలు రాజాబాబు, విశ్వనాథ్, రవి, ఎల్వీ రమణ, మాజీ సర్పంచ్ సురేష్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభయతో విద్యార్థినులకు అభయం


మాట్లాడుతున్న ఐలా ఈశ్వరయ్య

గుర్రంకొండ: అభయలోని పది సూత్రలు విద్యార్థినిల జీవితాలకు ఎంతో ఉపయోగపడతాయని రీడ్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఉర్దూ జెడ్పీహైస్కూల్లో హైదరాబాద్‌కు చెందిన అభయ ఫౌండేషన్ సంస్థ సహకారంతో బాలికలకు రక్షణ అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు తమ రక్షణ కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అభయ పదిసూత్రాల్లో భాగంగా బాలికలు అప్రమత్తంగా ఉండడం , భద్రత కొసం సామగ్రిని అందుబాటులో ఉంచుకోవడం, ఆపద సమయంలో సాయం కోరడం, గట్టిగా అరవడం, అనుచిత స్పర్శ వద్దు అనంతశక్తిని నీవే, ప్రతిఘటించడం, బాధను పంచుకోవడం, టోల్ ఫ్రీనెంబర్లు 1098,100పై ఆవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ సుల్తానా, ఉపాధ్యాయులు రాముడు, సుబ్బరాయుడు, తస్లీమా,వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భద్రత పథకాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

పీలేరు : సామాజిక భద్రత పథకాలపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ దొడ్డిపల్లె బ్రాంచ్ మేనేజర్ వెంకటేష్ అన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ స్థాయి జనసురక్ష కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సురక్ష బీమా యోజన. పీఎం జీవనజ్యోతి, బీమా యోజన, డిజిటల్ ట్రాన్సక్షన్‌పై, ప్రజలు అవగాహన కలిగి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18–40 సంవత్సరాలు మధ్య వయస్సు వారు ఏపీవై అటల్ పెన్షన్ యోజనపథకంకు అర్హులని తెలిపారు. తద్వారా 61 సంవత్సరాల నుంచి ఈ పథకం ద్వారా పెన్షన్ పొందవచ్చునని చెప్పారు. కౌన్సిలర్ సి. సుధాకర్, సీసీ కవిత, సంఘమిత్ర సుజాత పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

మదనపల్లె సిటీ: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్మికుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నట్లు ఎన్‌ఎంయూ ఆర్టీసీ కడప జోనల్ అధ్యక్షులు పి.వినోద్‌బాబు అన్నారు. మంగళవారం ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు జన్మదినం పురస్కరించుకుని స్థానిక జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, ఆర్టీసీ డిపో ఆవరణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్టీసీ కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కంచడానికి ఎన్‌ఎంయూ ముందుంటుందన్నారు. సమస్యపై దశలవారీగా ఆందోళనలు చేస్తామన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు టిఎస్ఎస్ రాజు,డిపో అధ్యక్ష, కార్యదర్శులు చలపతి, రమణ,మునికృష్ణ, రెడిబాషా, క్రిష్టానాయక్,బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాక రహదారి విస్తరణకు సర్వే


సర్వేను పరిశీలిస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాక రహదారి సర్వే సోమవారం నిర్వహించారు. నీటిపారుదలశాఖ జేఈ మధుసూదన్ ఆధ్వర్యంలో సర్వే సిబ్బంది సర్వేను సమగ్రంగా చేపట్టారు. హైవేలోని తాళ్లపాక ముఖద్వారం నుంచి తాళ్లపాక వరకు ఉన్న రహదారి విస్తరణ కోసం ఈ సర్వే చేపడుతున్నారు. సర్వేపై నివేదికను తితిదే అధికారులకు అందజేయనున్నారు. కాగా ఈ నెల7న ఈఓను గ్రామస్తులు కలిసి తాళ్లపాక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ నేపథ్యంలో అభివృద్ధికి సంబంధించి నివేదికలను టీటీడీ తెప్పించుకోవడం జరుగుతోంది. రహదారి అభివృద్ధిలో భాగంగా ప్రముఖుల విగ్రహాలను కూడా ఏర్పాటు చేసే ఆలోచనతో రహదారి వెడల్పు చేయనున్నారు. నీటిపారుదల శాఖ చేస్తున్న సర్వేలో ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, మాజీ సర్పంచి తనయుడు ఉద్దండం సుబ్రమణ్యం, ప్రముఖ ఆడిటర్ పంత్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు. టీటీడీ అధికారులు తాళ్లపాక గ్రామాభివృద్ధిపై దృష్టి సారించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.